ఎగ్జిబిషన్‌లో వాటర్‌ కలర్‌ పెయింటింగ్‌ పోటీలు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: ఎగ్జిబిషన్‌లో వాటర్‌ కలర్‌ పెయింటింగ్‌ పోటీలు నిర్వహించారు. ఆదివారం ఎగ్జిబిషన్‌ ఆర్టిజన్స్‌ సబ్‌ కమిటీ కన్వీనర్‌ అస్పియా ఆధ్వర్యంలో ఈ పోటీలు చేపట్టారు. విజేతలైన విద్యార్థులు, పిల్లలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

బీవైఎస్‌ ఆధ్వర్యంలో కైట్‌ ఫెస్టివల్‌



కైట్‌ ఫెస్టివల్‌లో యోగా గురువులు సత్యనారాయణ, లత

అబిడ్స్‌: భారతీయ యోగ్‌ సంస్థాన్‌ (బీవైఎస్‌) ఆధ్వర్యంలో కైట్‌ ఫెస్టివల్‌ నిర్వహించారు. సంక్రాంతి వేడుకల సందర్భంగా శనివారం ఇందిరా పార్కులో యోగా సభ్యులంతా పతంగులు ఎగరవేస్తూ సంబరాలు చేశారు. ఈ సందర్భంగా యోగా గురువులు సత్యనారాయణ, లత సద్ద మాట్లాడుతూ..యోగా సభ్యులు ఉత్సాహంగా, ఆరోగ్యకరంగా ఉండే విధంగా అన్ని పండుగలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నియామకం



సోమ్‌రాజ్‌ సింగ్‌

అఫ్జల్‌గంజ్‌: గోషామహల్‌ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడిగా సోమ్‌రాజ్‌ సింగ్‌ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమ్‌రాజ్‌ సింగ్‌ మాట్లాడుతూ..గోషామహల్‌ పార్టీ పటిష్టతకు, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ సహకారంతో గోషామహల్‌ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పాటుపడుతానన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



జగదీష్‌ యాదవ్‌

జియాగూడ: జియాగూడ డివిజన్‌లో బీజేపీని పటిష్టపరచడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా డివిజన్‌ అధ్యక్షుడిగా నియమితులైన జగదీష్‌యాదవ్‌ అన్నారు. ఆయన మాట్లాడుతూ..పార్టీలో కార్యకర్త, బూత్‌ స్థాయి అధ్యక్షుడు, శక్తికేంద్ర ఇన్‌చార్జి, బీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా సేవలందించారన్నారు.

బీజేపీ మెహిదీపట్నం డివిజన్‌ ప్రెసిడెంట్‌గా రాజేశ్‌



సాక్షి, సిటీబ్యూరో: బీజేపీ మెహిదీపట్నం డివిజన్‌ ప్రెసిడెంట్‌గా చింతల రాజేశ్‌ను నియమిస్తూ పార్టీ హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ ఎస్‌.గౌతమ్‌ రావు ఉత్తర్వులు వెల్లడించారు. ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డివిజన్‌ నూతన అధ్యక్షుడు రాజేశ్‌ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డిగారికి, డాక్టర్‌ ఎస్‌.గౌతమ్‌ రావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన క్రీడాకారులతో సుందరి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మూడు రోజులుగా సెయింట్‌ జోసెఫ్‌ పాఠశాలలో జరుగుతున్న 68వ నేషనల్‌ స్కూల్‌ గేమ్స్‌ యోగాసన అండర్‌–14 బాలికల చాంపియన్‌షిప్‌ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చాంపియన్‌షిప్‌ కో ఆర్డినేటర్‌ యూఏ సుందరి మాట్లాడుతూ..ప్రత్యేకంగా క్రీడలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో ఢిల్లీ టీమ్‌ విజేతగా నిలిచి కప్‌ను స్వాధీనం చేసుకుంది.

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

అబిడ్స్‌, చార్మినార్‌, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికార, అనధికార ప్రముఖులు వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సేవలను పలువురు కొనియాడారు.

– అబిడ్స్‌, చార్మినార్‌, మెహిదీపట్నం జోన్ల బృందం



రవీంద్ర ఆర్ట్స్‌ ఆధ్వర్యంలో..ఎమ్మెల్యే రాజాసింగ్‌, బీజేపీ నేత గోవింద్‌ రాఠీ



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ



మాట్లాడుతున్న కాప్టెన్‌ త్రిపాఠి



విశ్వ హిందూ పరిషత్‌ ఆర్యనగర్‌ జిల్లా ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు



వేడుకల్లో కార్పొరేటర్‌ లాల్‌సింగ్‌ తదితరులు



గుడిమల్కాపూర్‌లో నివాళులర్పిస్తున్న అమర్‌సింగ్‌, బంగారి ప్రకాష్‌ తదితరులు



జియాగూడ బీజేపీ కేలండర్‌ను విడుదల చేస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు



శ్లోకా ది స్కూల్‌లో..



ఉప్పగూడలో..

టేబుల్‌ టెన్నిస్‌లో సత్తాచాటిన హనీష్‌ అమర



కప్‌తో హనీష్‌ అమర

గన్‌ఫౌండ్రీ: క్రీడలపై మక్కువ ఉండి నిత్యం సాధన చేస్తే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చని నిరూపించాడు ఈ చిచ్చర పిడుగు. పదేళ్ల వయస్సులోనే ఎన్నో విజయాలను సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు మాస్టర్‌ హనీష్‌ అమర. సెయింట్‌పాల్స్‌ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 6వ తరగతి విద్యను అభ్యసిస్తున్నాడు. తన అన్నయ్యను చూసి స్ఫూర్తిని పొందానని, రాబోయే రోజుల్లో దేశం తరఫున ఆడి పతకాలను సాధించడమే తన లక్ష్యమని మాస్టర్‌ హనీష్‌ తెలిపాడు.

సాధించిన విజయాలు..

- 2024 జూన్‌ 9న లిటిల్‌ఫ్లవర్‌ హైస్కూల్‌లో టీటీ టోర్నమెంట్‌ విజేత.
- జులై 27న జరిగిన మహవీర్‌ ఇనిస్టిట్యూట్‌ టోర్నమెంట్‌లో విజేత.
- ఆగస్టు 9న జరిగిన గుజరాతి సేవా మండల్‌ టోర్నమెంట్‌లో రన్నర్‌.
- ఆగస్టు 30న ఎల్బీస్టేడియంలో జరిగిన రాష్ట్ర ర్యాంకింగ్‌ టోర్నమెంట్‌లో విజేత.
- నవంబర్‌ 3న జరిగిన ఎస్‌పీహెచ్‌ఎస్‌ టోర్నమెంట్‌లో రన్నర్‌.
- డిసెంబర్‌ 28న ఫైర్‌ఫాక్స్‌ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు.

సత్కారం



సుల్తాన్‌బజార్‌: మహా కవి సినారే కళాపీఠం సాహిత్య సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేకేడి రాములును తెలుగు బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ సంస్థ ఘనంగా సత్కరించింది. సంస్థ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మల్లేకేడి రాములుకు అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమం తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగింది. మల్లేకేడి రాములు సేవలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశామని రికార్డ్స్‌ అధినేత డాక్టర్‌ చింతపట్ల వెంకటాచారి తెలిపారు.

పిండి వంటల ఘుమఘుమలు

అబిడ్స్‌/జియాగూడ: సంక్రాంతి పండుగకు పిండి వంటల ఘుమఘుమలు నోరు ఊరిస్తుంటాయి. తెలంగాణ వంటలలో ప్రత్యేకం సకినాలు, పల్లి చెక్కలు, అరిసెలు ఇప్పటికే మార్కెట్లలో లభ్యమవుతున్నాయి. తెలంగాణలో గాలిపటాలను ఎగరవేస్తూ పిండి వంటల రుచులు చూస్తూ ఎంజాయ్‌ చేస్తారు. బిజీ లైఫ్‌లో ఇంట్లో పిండి వంటలు చేసుకోలేని వారు మార్కెట్లలో లభించే పిండి వంటలపై ఆధారపడుతున్నారు. మహిళలు కుటీర పరిశ్రమల వలె ఇంట్లో తయారు చేసి విక్రయిస్తున్నారు.

అభిరుచులకు తగ్గట్టుగా తయారీ...

పండుగలకు కొనుగోలుదారుల ఆసక్తి మేరకు పిండి వంటలు తయారు చేసే మహిళలు రుచికరమైనవి తయారు చేస్తున్నారు. ముఖ్యంగా అరిసెలు, సకినాలు, మురుకులు, భూంది, నువ్వుల లడ్డులు, సర్వ పిండి తదితరవి ఎన్నో రకాలు తయారు చేసి మార్కెట్లకు సప్లయ్‌ చేస్తున్నారు. ఉపాధితో పాటు లాభాలు వస్తున్నాయి.



సర్వ పిండి వంటలు చేస్తున్న స్వర్ణలత



పల్లి చెక్కలు తయారు చేస్తున్న దృశ్యం

మంచి ఆదరణ లభిస్తుంది..

మార్కెట్లలో ఎన్నో రకాల మిఠాయిలు లభ్యమవుతున్నా పండుగల సందర్భంలో పిండి వంటలకు మంచి ఆదరణ లభిస్తుంది. తక్కువ ధరలకే లభిస్తున్నాయి.

– స్వర్ణలత, దత్త స్వగృహ గుడిమల్కాపూర్‌

గోమాతను రాష్ట్ర మాతగా ప్రకటించాలి



సంతకాల సేకరణ చేపట్టిన ఎన్‌ఆర్‌.లక్ష్మణ్‌రావు తదితరులు

అఫ్జల్‌గంజ్‌: గోమాతను రాష్ట్రమాతగా ప్రకటించాలని బజరంగ్‌ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌ఆర్‌.లక్ష్మణ్‌రావు డిమాండ్‌ చేశారు. ఆదివారం అబిడ్స్‌ ఇస్కాన్‌ ఆలయం వద్ద పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ..గోమాతను రాష్ట్రమాతగా ప్రకటించేంత వరకు తెలంగాణ రాష్ట్ర నలుమూలలా ప్రశాంత వాతావరణంలో తమ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించేంత వరకు బజరంగ్‌ సేనా కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్‌ ఆలయ సభ్యులు రాధా మదన్‌మోహన్‌, బజరంగ్‌ సేనా ఉపాధ్యక్షులు సంజయ్‌కుమార్‌, రాఘవ కుమార్‌, ఇతర నాయకులు సురేందర్‌ తురానా, మనోజ్‌ మోగల్‌ దిడ్డి, రామేశ్వర్‌ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నమ్మళ్వార్‌ పరమపద మహోత్సవం



చార్మినార్‌: వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నమ్మళ్వార్‌ పరమపద మహోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం గోదా కల్యాణం మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామని చార్మినార్‌ చౌక్‌ మైదాన్‌ ఖాన్‌లోని బాలాజీ ఆలయ అర్చకులు, అలంకార బ్రహ్మ ఆత్రేయ ఆచార్యులు తెలిపారు. ఈనెల 10న ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు 15వ తేదీ వరకు కొనసాగనున్నాయన్నారు. ఈనెల 12న నమ్మాల్వార్‌ పరమపద మహోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించామన్నారు. అలాగే 13న గోదా కల్యాణం, 15న అమ్మవారికి వడి బియ్యం సమర్పణ తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నామన్నారు.

పీజేఆర్‌కు ఘన నివాళి



దూద్‌బౌలి: రాజీవ్‌ గాంధీ సద్భావన స్థూపం దగ్గర మాజీ సీఎల్పీ నాయకుడు పీ. జనార్దన్‌రెడ్డి జయంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ కార్యదర్శి కన్నయ్య లాల్‌ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలలో ఆయనకు ఒక సముచిత స్థానం ఉందన్నారు. కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు ఆనంద్‌, వెంకటేష్‌ ముదిరాజ్‌, శ్యామ్‌ రావు ముదిరాజ్‌. రాజేష్‌ కుమార్‌, కృష్ణ కుమార్‌, రాజేష్‌ వాల్మీకి పాల్గొన్నారు.

జోరుగా పంతగుల విక్రయాలు

చార్మినార్‌: పాతబస్తీలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. చిన్నారులు, యువకులు పతంగులను ఎగురవేస్తూ మతసామరస్యానికి చిహ్నంగా నిలుస్తున్నారు. ఎటు చూసినా సంక్రాంతి సంబరాలే కనిపించాయి. రంగురంగుల వెరైటీ పతంగులు మార్కెట్‌లోకి రావడంతో వాటిని ఖరీదు చేయడంలో యువకులు ఉత్సాహం చూపించారు. పతంగుల క్రయ, విక్రయాలు జోరందుకున్నాయి.

యాకుత్‌పురా: యాకుత్‌పురా గంగానగర్‌ నాలా, మాతాకీ కిడికి ప్రాంతాల్లో పతంగుల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ రకాల పంతగులు, దేశీయ మాంజాలు, చెరక్‌లను విక్రయిస్తున్నారు. పతంగులను డజనుకు రూ.50 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు.

గోల్కొండ: గోల్కొండ, గుడిమల్కాపూర్‌, కార్వాన్‌, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా పతంగులు బాగా అమ్ముడవుతున్నాయి. కాలనీలు, ప్రధాన రహదారుల వద్ద ప్రత్యేకంగా డబ్బాలు పెట్టి మరి అమ్ముతున్నారు. మరో వైపు వివిధ రకాల మాంజాలు కూడా జోరుగా అమ్ముతున్నారు.



గుల్జార్‌ హౌజ్‌ పతంగుల దుకాణాల వద్ద..



గోల్కొండలో..



యాకుత్‌పురా గంగానగర్‌లో..

ఉచితంగా వైద్య సేవలందించడం అభినందనీయం



మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న డాక్టర్‌ సందీప్‌కుమార్‌, డాక్టర్‌ వంశీ తిలక్‌

అబిడ్స్‌: ఎగ్జిబిషన్‌ సందర్శకులకు ఎగ్జిబిషన్‌ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి యేటా ఉచితంగా వైద్య సేవలందించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పేర్కొన్నారు. సందర్శకుల కోసం ఎగ్జిబిషన్‌లో పలు విభాగాల డాక్టర్లచే వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి పలు సేవలు అందిస్తున్నారన్నారు. ఆదివారం ఎగ్జిబిషన్‌ సొసైటీ హెల్త్‌ సెంటర్‌ కన్వీనర్‌ డాక్టర్‌ సంజీవ్‌ కుమార్‌, యశోదా ఆసుపత్రి మెడికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ లింగయ్య, ఎగ్జిబిషన్‌ సొసైటీ సభ్యులు డాక్టర్‌ వంశీ తిలక్‌, డాక్టర్‌ వెంకట్‌ప్రసాద్‌రెడ్డి, డాక్టర్‌ శ్రీనివాస్‌లు మంత్రిని కలిసి ఈ నెల 17న ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు అయ్యే మెడికల్‌ స్టాల్‌ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వైద్యసేవలు అందించేందుకు ఎగ్జిబిషన్‌ మెడికల్‌ స్టాల్‌ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పనిచేసే కార్యకర్తలకు పెద్దపీట



మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆహ్వాన పత్రం అందజేస్తున్న కృష్ణ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్‌ పార్టీలో పనిచేసే కార్యకర్తలకు పెద్దపీట వేయడం జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ అన్నారు. గుడిమల్కాపూర్‌ వెజిటెబుల్‌ మార్కెట్‌ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ పత్రాన్ని కాంగ్రెస్‌ నాయకులు ఆదివారం ఆయనను కలిసి అందించారు. ఈ నెల 17న నూతనంగా నియమించబడిన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఉందని ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా కాంగ్రెస్‌ నాయకులు కురాకుల కృష్ణ, ముంగి రఘుపాల్‌రెడ్డి ఆయనను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం రావడానికి కింది స్థాయి కార్యకర్తల కృషి ఎంతగానో ఉందని ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు అన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు



మాట్లాడుతున్న మౌలానా మతీన్‌ అలీషా

గోల్కొండ: హజ్రత్‌ ఖాజా మొహియుద్దీన్‌ చిష్తి 813వ ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఆదివారం గోల్కొండ రేతిగల్లీలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆల్‌ ఇండియా ఖీరత్‌ కమిటీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్‌ మతీన్‌ ఆలీషా ఖాద్రి ముఖ్య అతిథిగా హాజరై హజ్రత్‌ ఖాజా మొహియుద్దీన్‌ చిష్తి పేదలకు, నిరక్షరాస్యుల జీవితాల్లో వెలుగులు నింపడానికి చేసిన కృషిని వివరించారు. తాను బస చేసిన ప్రాంతాల్లో నిరక్షరాస్యులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వారి జీవితాల్లో అక్షర జ్యోతిని వెలిగించారన్నారు.

అన్నదానం

గోల్కొండ: అన్నదానానికి మించిన మరో దానం ఏది లేదని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. టోలిచౌకీ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి జన్మదినం సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో మాతృదేవోభవ అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం వ్యవస్థాపకుడు గట్టు గిరి, బి.సురేష్‌చారి, వాణిశ్రీ తదితరులున్నారు.



గాలిపటాల పంపిణీ



విజయనగర్‌కాలనీ: సంక్రాంతిని పురస్కరించుకొని ఆసిఫ్‌నగర్‌ గాంధీ విగ్రహం చౌరస్తా వద్ద కాంగ్రెస్‌ నాయకుడు కె.రవితేజ ఆధ్వర్యంలో చిన్నారులకు గాలిపటాలు అందజేశారు. డివిజన్‌ అధ్యక్షుడు నరేష్‌, కాంగ్రెస్‌ నాయకులు బ్లాక్‌ అధ్యక్షులు, యువ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగోలీ పోటీలు



పోటీల్లో పాల్గొన్న మహిళలు

జియాగూడ: ముస్తయిద్‌పురా కుమ్మరివాడి మున్నూర్‌కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ హిల్స్‌ పైన రంగోలీ పోటీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 71 మంది మహిళలు పాల్గొనగా గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు మ్యాడం రమేష్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి ప్యాట కృష్ణదాస్‌, కోశాధికారి ప్యాట రాఘవదాస్‌, సలహాదారుడు ఆకుల నర్సింగ్‌రావు, మహిళా సంఘం అధ్యక్షులు ప్యాట పద్మవతి, కార్యదర్శి ఆకుల అర్చన, మారిశెట్టి లత, ఆర్గనైజర్‌ తోట శ్రవణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో సిరికోన సప్తమ సాహిత్యోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి వెంపటి హేమకు కోడూరు పార్వతి స్మారక పురస్కారం, సంస్కృతాంధ్ర ఉభయ భాష ద్వి శతావధాని పాలడుగు చరణ్‌కు విశిష్ట పండిత పురస్కారం, నవల రచయిత ముక్తవరం పార్థసారథికి ఉత్తమ అనువాదక, కవయిత్రి అరవిందరావుకు ఉత్తమ కవయిత్రి, రచయిత్రి నాగజ్యోతి శేఖర్‌కు, డి.చంద్రశేఖర్‌కు సిరికోన విశిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు. అదేవిధంగా పలువురు రచయితలు రచించినటువంటి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజో–విభో–కందాలం ట్రస్ట్‌ చైర్మన్‌ ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఒకే వేదికపై వివిధ గ్రంథాలకు చెందిన వ్యక్తులను సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ద్రవిడ విశ్వ విద్యాలయం పూర్వ ఉపకుల పతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, సిరికోన సాహితీ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.